ప్రజాశక్తి
ఆదివారం 28 జనవరి 2024 5 అనంతపురం

సమావేశంలో మాట్లాడుతున్న ఉపకులపతి జివిఆర్ శ్రీనివాసరావు

జెఎన్‌టియు న్యాక్ అక్రిడిటేషన్ దరఖాస్తు పూర్తి

ఫిబ్రవరి 22న న్యాక్ బృందం రాక-ఉపకులపతి జివిఆర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు న్యాక్ అక్రిడిటేషన్ కోసం న్యాక్ బెంగళూరుకు కార్యాలయంలో దరఖాస్తు సమర్పించడం పూర్తయినట్లు ఉపకులపతి జివిఆర్.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం విశ్వవిద్యాలయంలోని విసి కాన్ఫరెన్స్ హాలులో వర్సిటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాక్ అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు సమర్పణ పూర్తి కావడంతో ఫిబ్రవరి 22న న్యాక్ బృందం విశ్వవిద్యాలయాన్ని పర్యవేక్షించేందుకు రానున్నట్లు తెలిపారు. 24 వరకూ ఇక్కడే ఉండి విద్య, మౌలిక సదుపాయాలు పరిశీలించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా న్యాక్ బృందానికి ఏ పత్రాలు చూపించాలో వివరించేందుకు విటియు మాజీ ఉపకులపతి కె.బాలవీరారెడ్డి హాజరై వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, వర్సిటీ డైరెక్టర్లు, ఐ క్యూసి డైరెక్టర్ జివి.సుబ్బారెడ్డి, వి.సుమలత, ఇ.కేశవరెడ్డి, దుర్గాప్రసాద్, కిరణ్మయి, సి.శోభాబిందు, పద్మసువర్ణ, ఎ.సురేష్‌బాబు, బి.ఈశ్వర్‌రెడ్డి, ఎన్.విశాలి, విబి.చిత్ర, పి.సుజాత, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, పిఆర్.భానుమూర్తి, వివిధ విభాగాల అధిపతులు భువనవిజయ, కె.ఎఫ్.భారతి, కె.కళ్యాణిరాధ, మమత, దిలీప్‌కుమార్, అజిత, శివకుమార్, విష్ణువర్ధన్, శ్యాంబాబు, శివలింగారావు, కోఆర్డినేటర్లు, అడహక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్ పేరుతో డబ్బుల వసూళ్లు : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రాక్టికల్స్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని చైతన్య జూనియర్ కళాశాల వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం సంబంధించి ప్రాక్టికల్స్ చివరి పరీక్షలు ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నారు. దీన్ని అవకాశంగా తీసుకున్న చైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేయడం ప్రారంభించాయన్నారు. విద్యార్థులకు మాయ మాటలు చెబుతూ ప్రాక్టికల్స్ చేసే సమయంలో ఇతర కళాశాల నుంచి లెక్చరర్లు వస్తారని, వారికి డబ్బులు ఇవ్వాలని వసూళ్లకు దిగారని ఆరోపించారు. ఒక్కో విద్యార్థి నుంచి సుమారు రూ.2వేల పైబడి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. డబ్బులు ఇవ్వని విద్యార్థులను మానసికంగా ఒత్తిడి గురి చేస్తున్నారని వాపోయారు. వెంటనే ప్రాక్టికల్స్ పేరుతో డబ్బులు వసూలు చేసే కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పరీక్షలు దగ్గర పడే సమయంలో ఫీజు చెల్లించలేని విద్యార్థులకు ప్రాక్టికల్స్ హాల్ టికెట్ ఇవ్వమని ఒత్తిడికి గురి చేస్తున్నారు. నారాయణ హాస్టల్ క్యాంపస్ వద్ద డబ్బులు చెల్లించలేని విద్యార్థులను కళాశాల బయట ఉంచుతున్నారన్నారు. దీంతో మానసికంగా కుంగిపోతున్నారన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి అలాంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్షుడు భీమేష్, నగర ఉపాధ్యక్షుడు సోము, నాయకులు లచ్చి, చిన్న, సుబ్బరాయుడు, భార్గవ్‌రాముడు, గురుస్వామి, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

కదిలొచ్చిన తమ్ముళ్లు

ఉరవకొండలో జరిగిన రా కదలిరా బహిరంగ సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు, హాజరైన టిడిపి కార్యకర్తలు

- ఉరవకొండ సభకు స్పందన
- జిల్లాకు వాగ్దానాలిచ్చిన చంద్రబాబు
- 'రా కదలిరా' సభ విజయవంతం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'రా కదలిరా' సభకు తెలుగు తమ్ముళ్లు కదిలొచ్చారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు చేపట్టిన ఈ సభకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలొచ్చారు. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అధ్యక్షతన జరిగిన సభ జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు అధికార వైసిపిపై విమర్శలు గుప్పిస్తూనే, తాము అధికారంలోకి వస్తే ఏమి చేయబోతున్నామన్న వాగ్ధానాలు చేశారు. జిల్లాలోనున్న సమస్యలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. అదే సమయంలో అధికార వైసిపి ప్రజాప్రతినిధులపైనా ఆరోపణలు చేశారు. అనంతపురం జిల్లాకు సాగునీటికి అధిక ప్రాధాన్యతనిస్తామని హామీనిచ్చారు. ప్రతి ఎకరానికి నీరివ్వడమే తన లక్ష్యమని హామీనిచ్చారు. ఇది వరకే హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నం చేసినట్టు గుర్తు చేశారు. అవి ఇప్పుడు మధ్యలోనే ఆగిపోయాయని వాటిని పూర్తి చేస్తామని తెలిపారు. అదే విధంగా బిందు తుంపెర సేద్యానికి అధిక ప్రాధాన్యతినిస్తామన్నారు. తెలుగుదేశం అధికారంలోనున్న సమయంలో ఉరవ కొండ నియోజక వర్గం పరిధిలో చేపట్టిన సాముహిక బిందు సేద్యం ప్రాజెక్టును ఈప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రూ.30 కోట్ల విలువైన డ్రిప్ పరికరాలు వృథాగా పడి ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టును వైసిపి పూర్తి చేసి ఉంటే 50 వేల ఎకరాలకు సాగునీరందిందేదని చెప్పారు. భైరవానితిప్ప, పేరూరు ఎత్తిపోతల పథకాలను తాము చేపడతామన్నారు. అనంతపురం జిల్లా వాణిజ్య పంటలకు అవనువైనదని చెప్పారు. బిసిలు అధికంగానున్న అనంతపురం జిల్లాలో వారికి దన్నుగా టిడిపి ఉంటుందని తెలిపారు. ఇదే సందర్భంలో అనంతపురం జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన ఎమ్మెల్యేలపైనా అవినీతి ఆరోపణలు అధికంగానున్నాయన్నారు. భూకబ్జాలు దౌర్జన్యాలు అధికమయ్యాయని ఆరోపించారు. బ్రహ్మసముద్రం మండలంలో శుక్రవారం నాడు జరిగిన మహిళపై దాడిని ప్రస్తావించారు. ఈ ఆరోపణలున్న ఎమ్మెల్యేలను పక్క నియోజకవర్గాలకు బదిలీ చేస్తే ప్రయోజనమేముంటుందని మంత్రి ఉషచరణ్ శ్రీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తప్పు చేసిన వారు ఎవరినీ తాము అధికారంలోకి వచ్చాక వదిలిబెట్టబోమని హెచ్చరించారు. ఈ కాలంలో టిడిపి కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనారన్నారు. అయినా పార్టీకి అండగా నిలిచారన్నారు. అందరూ సమిష్టిగా కలపి ఈ 76 రోజులు పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జనసేనను కలుపుకుని పనిచేయాలని సూచించారు. జిల్లా సమస్యలను ప్రస్తావించడంతోపాటు రాష్ట్ర వ్యాప్త సమస్యలపైనా మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ పాలనను నిశితంగా దుయ్యబట్టారు. ఆ సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను స్పందన కనిపించింది. మొత్తంగా టిడిపి సభ విజయవంతం కావడం పట్ల ఆ పార్టీ నేతల్లోనూ ఉత్సహం నెలకొంది. చంద్రబాబు మాట్లాడటానికి ముందు పయ్యావుల కేశవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాత్రికి ఉరవకొండలోనే బస

ఉరవకొండ సభ అనంతరం టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు రాత్రికి అక్కడే బస చేశారు. ఆదివారం ఉదయం ఇక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి నెల్లూరుకు వెళ్లనున్నారు

చరిత్రను తిరగరాద్దాం : కేశవ్

ఉరవకొండ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉరవకొండ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో టిడిపి జెండాను ఎగురవేసి చరిత్రను తిరగరాద్దామని పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. ఉరవకొండలో నిర్వహించిన రాకదలిరా బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 1994వ సంవత్సరంలో ఉరవకొండ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో కూడా తెలుగుదేశం పార్టీ గెలిచి ప్రభంజనం సష్టించి అధికారాన్ని చేపట్టిందని గుర్తు చేశారు. 2024లో అదే పునరావృతం కాబోతోందన్నారు. నారా చంద్రబాబు నాయుడు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు.

నేతల తాకిడి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలకు సమయం ముంచుకొస్తున్న కొద్దీ నేతల తాకిడి పెరుగుతోంది. ఈవారంలో మూడు రాజకీయ పార్టీల అధ్యక్షులు జిల్లాకు విచ్చేశారు. మొన్న సిఎం జగన్ రాగా, నిన్న టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు వచ్చారు. నేడు కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల రానుంది. ఇలా వరుసగా ఒకరి తరువాత ఒకరు జిల్లాకు వస్తున్నారు. దీంతో జిల్లాలో రాజకీయ వాతావరణం వెడెక్కుతోంది. విమర్శలు, ప్రతివిమర్శలు పార్టీలు, నేతల మధ్య జోరందుకున్నాయి. కొన్ని రోజుల్లో నోటిఫికేషన్ రానుండటంతో ఇవి మరింత జోరందుకోనున్నాయి. ఈనెల 24న సిఎం జగన్ ఉరవకొండకు వచ్చిన సమయంలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తూనే ప్రతిపక్షాలపై విమర్శలు సంధించారు. అందరూ కూడబలుక్కుని వైసిపిని ఓడించే ప్రయత్నాలు చేస్తున్నారంటూ విమర్శలు చేశారు. తనకు వ్యతిరేకంగా మూకుమ్మడి క్యాంపెయిన్ నడుస్తోందన్నారు ఆయన తర్వాత అదే ఉరవకొండకు టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు విచ్చేశారు. వాటికి సమాధానంగా ఆయన ప్రతి విమర్శలు చేశారు. ప్రభుత్వాన్ని వ్యతిరేకించే వారందరినీ ఒక గాటికి కట్టేసే ప్రయత్నం సిఎం జగన్ చేస్తున్నారని మండిపడ్డారు. ఇక నేడు వైఎస్.షర్మిల వస్తుండటం మరింత ఆసక్తికరంగా మారుతోంది. ఎందుకంటే ఇప్పటికే సగం స్థానాలకు వైసిపి టిక్కెట్టు ఖరారు చేసిన నేపథ్యంలో అవి దక్కని వారు ప్రత్యామ్నాయ పార్టీల వైపు చూస్తున్నారు. ప్రధానంగా రాయదుర్గం కాపు రామచంద్రారెడ్డి, వైసిపి నుంచి సస్పెండ్ అయిన మధుసూదన్‌రెడ్డి తదితరులు కాంగ్రెసులో చేరుతారన్న ప్రచారం నడుస్తోంది. ఆదివారం జరిగే పర్యటన వారు చేరుతారా ఇంకా వేచి చూస్తారా అన్నది కూడా చూడాల్సి ఉంది. ఇలా మూడు ప్రధాన పార్టీల అధ్యక్షులతో ఈ వారం రాజకీయ వాతావరణం వాడివేడిగా సాగింది. ఈ వేడి రాబోయే రోజుల్లోనూ మరింత పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, నేతలు కూడా ఈ పర్యటనలను నిశ్చితంగా పరిశీలిస్తున్నారు. వారున్న పార్టీల్లో టిక్కెట్లు దక్కకపోతే మరో మార్గం ఎంచుకుంటే ఎలాగుంటుందన్న బేరీజులు వేసుకునే పనిలో బిజీబిజీగా ఉంటున్నారు. సమయం కూడా ఆసన్నమవుతుండటంతో ఎటోవైపు రాజకీయ అడుగులు వేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇక ఖరారైన వారు తమ నియోజకవర్గాల్లో పనిని మొదలుపెట్టుకునే పనిలో ఉన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పరిచయ కార్యక్రమాలు కొత్తవారు చేసుకుంటుండగా, పాతవారు ప్రజల్లోకి చేరకయ్యేందుకు కసరత్తులు ముమ్మరం చేస్తున్నారు. అందుకు అవసరమైన అన్ని రకాల వనరులను సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. ఇంకో వైపు అధికార యంత్రాంగం ఎన్నికలకు సమయత్తమవుతోంది. ఇప్పటికే బదిలీల ప్రక్రియ మొదలైంది. తహాశీల్దార్, ఎంపిడిఒలను ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు బదలీలు వచ్చేశాయి. జిల్లా అధికారుల్లోనూ మార్పులు, చేర్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇంకోవైపు ఎన్నికల ఓటర్ల ప్రక్రియ నడుస్తోంది. ఎన్నికల సంఘం సూచనల మేరకు ఓటర్ల జాబితాను కలెక్టర్ విడుదల చేశారు. ఇందులోనూ అనేక లోపాలున్నాయంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. వాటిని సరిచేసే పనిలో అధికార యంత్రాంగం ఉంది. ఏదిఏమైనా ఎన్నికల హడావుడి రోజురోజుకూ పెరుగుతూ పోతోంది. అటు రాజకీయంగా, ఇటు అధికార యంత్రాంగం పరంగా సమయత్తమవుతన్నారు.

షర్మిల పర్యటనను విజయవంతం చేద్దాం

ఉరవకొండ : పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నేడు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఉపాధ్యక్షులు వడ్ల ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సోనియా శీన, జిల్లా కార్యదర్శి ఇంద్రావతి ఓబులేసు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ షర్మిల నియామకం కావడంతో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వచ్చిందన్నారు. కావున పర్యటనను విజయంతం చేయాలని పిలుపునిచ్చారు.

అనంతపురం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళనలో మాట్లాడుతున్న నాయకులు



తాడిపత్రి మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

సమ్మె హామీల అమలుకు జీవో జారీ చేయాలి

మున్సిపల్ కార్యాలయాల వద్ద పారిశుధ్య కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నిరవధిక సమ్మెలో భాగంగా మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు వెంటనే జీవోలు జారీ చేయాలని కార్మిక సంఘ నేతలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో కార్మిక సంఘం నేత ఎర్రిస్వామి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16 రోజులపాటు పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేస్తే దిగొచ్చిన ప్రభుత్వం కార్మిక సంఘం నాయకులతో చర్చలు జరిపి కార్మికులకు రూ.21వేల జీతం, స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు, పార్క్ వర్కర్లకు హెల్త్ అలవెన్స్, పారిశుధ్య విభాగ డ్రైవర్లకు రూ.24,500 వేతనం, మరణించిన కార్మికులకు మట్టి ఖర్చులు రూ.20వేలు, బకాఇయ సరెండర్ లీవ్‌లు, కరోనా సమయంలో పనిచేసిన, మలేరియా కోవిడ్ గార్బేజ్, కార్మికులకు పని భద్రత కల్పిస్తూ రూ.15వేలు, రిటర్మెంట్ బెనిఫిట్ స్కీమ్స్, సమ్మె కాలం వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే ఇంత వరకూ వాటిలో ఏ ఒక్కటీ అమలు చేసిన పాపానపోలేదన్నారు. కావున ఇప్పటికైనా స్పందించి వెంటనే సంబంధిత హామీల అమలుకు జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు 1వ, 2వ పట్టణ అధ్యక్షులు ఎన్టీఆర్ శ్రీనివాసులు, గురురాజా, నాయకులు మసూద్, ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, ఆజాం, నల్లప్ప, కెవిపిఎస్ నాయకులు వెంకటేశు, బుల్లే రాజు, నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారి ఎర్రిస్వామి, సాకే తిరుమలేశు, కోశాధికారి ఉపాధ్యక్షులు శచేంద్రకుమార్, లక్ష్మీనరసమ్మ, మహిళా కన్వీనర్ మంత్రి వరలక్ష్మి, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, ప్రజానాట్య మండలి నాగేంద్ర, కమిటీ సభ్యులు రాఘవేంద్రప్రసాద్ ప్రభాకర్, కమల్‌కుమార్, జ్యోతి, మంజులమ్మ, అరుణమ్మ, అక్కులప్ప, నల్లప్ప, సర్దానమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు వెంటనే జీవోను విడుదల చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మె చేపడితే ప్రభుత్వం కార్మిక సంఘం నాయకులతో చర్చించిన హామీల్లో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే సంబంధిత హామీల అమలుకు జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ అధికారికి వినతిపత్రం అందజేశారు.

గుత్తి : మున్సిపల్ కార్మికుల 16 రోజుల సమ్మె కాలాన్ని రెగ్యులర్ రైజ్ చేసి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గుత్తిలో శనివారం ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమ్మె ఒప్పందాల్లో భాగంగా రూ.21వేలు, రూ.24,500 వేతనాలకు సంబంధించిన జీవోలను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యనారాయణ, ఎన్.రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు కే.మహేష్, సహాయ కార్యదర్శి సుంకన్న, కోశాధికారి బాలరంగన్న, నాయకులు ఈశ్వరయ్య, నాగేంద్ర, ఆంజనేయులు, ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ఎస్.రాజా, ఉపాధ్యక్షుడు ఎస్ఎ.మురళి, కార్యదర్శి రవిశంకర్, నాయకులు నరసింహా, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులు

రాయదుర్గంలో ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులు

రాయదుర్గం : సమ్మెలో భాగంగా ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున సమ్మె సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే ఇచ్చిన హామీలకు సంబంధించిన జీవోలను విడుదల చేయాలని, లేనిపక్షంలో మరోమారు ఉద్యమ బాట పట్టేందుకు సంసిద్ధంగా ఉంటారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు తిప్పేస్వామి, మల్లేష్, సిద్ధ, వెంకటేశులు, ఆదిలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు జెండాలు లేకుండా చేయడం ఎవరితరం కాదు

సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్

ప్రజాశక్తి-ఉరవకొండ

కమ్యూనిస్టు జెండాలు లేకుండా చేయడం ఎవరితరం కాదని సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. ఉరవకొండలో నిర్వహించిన చంద్రబాబు రా కదలిరా బహిరంగ సభలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ రాష్ట్రంలో టిడిపి, జనసేన జెండాలు తప్ప సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ తదితర పార్టీల జెండాలు కనబడకుండా చేస్తామని మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను టిడిపి, జనసేన అనుసరిస్తుందన్నట్లుగా చెప్పకనే చెబుతున్నారని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న ఏపార్టీనైనా ప్రజలు భూస్థాపితం చేస్తారన్న సంగతి మరువరాదన్నారు. రాష్ట్రంతోపాటు దేశంలో అధిక శాతంలో ఉన్న బడుగు వర్గాలతోపాటు చిన్న, సన్నకార రైతులు, కార్మికులకు మేలు జరగాలంటే అది ఎర్రజెండాల పోరాటాలతోనే సాధ్యమన్నారు. బహిరంగ సభల్లో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని హితువు పలికారు.

లింగవివక్ష నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-ఉరవకొండ

లింగవివక్ష నిర్మూలపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మోపిడి గ్రామంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ ఎండి షఫీ ఆధ్వర్యంలో లింగ వివక్ష నిర్మూలనపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మాయిలకు వివాహ వయస్సు వచ్చిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. అంతేగాకుండా గర్భస్త లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధం అన్నారు. ఒకవేళ ఎవరైనా గర్భస్త లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. బాల,బాలికల మధ్య తల్లిదండ్రులు వ్యత్యాసం చూపరాదన్నారు. ఇద్దరు సమానమేనన్నారు. కొందరు తల్లిదండ్రులు మగపిల్లల పట్ల మక్కువతో ఆడపిల్లల పట్ల చులకన భావంతో ప్రవర్తిస్తున్నారని, ఇది సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎం అనూషా, సీఓ దాస్, అంగన్వాడీ స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు అందుకుంటున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ నాయకులకు నోటీసులు

రాయదుర్గం : ఈనెల 28న రాజమండ్రిలో యుటిఎఫ్ తలపెట్టిన సభకు వెళ్లరాదంటూ స్థానిక యుటిఎఫ్ నాయకులకు పోలీసులు శనివారం నోటీసులు జారీ చేశారు. ఇందులో భాగంగా యుటిఎఫ్ మండల నాయకుడు వెంకట్రామిరెడ్డి, గుమ్మగట్ట మండల నాయకులు రవికుమార్, ఆంజనేయులు, నాగరాజు తదితరులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ నోటీసులు జారీ చేసి ఉద్యమాలను అణచివేయాలని చూస్తే పతనం తప్పదన్నారు.

29న వాలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

రాయదుర్గం : పురపాలక సంఘం పరిధిలోని ఆరు సచివాలయల్లో ఖాళీగా ఉన్న 8 వాలంటీర్ల పోస్టులకు ఈనెల 29న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ మేనేజర్ పిఎన్.ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని మేనేజర్ కోరారు.

సజావుగా మండల సమావేశం

గుత్తి : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి జి.విశాలాక్షి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపిపి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ చిట్రా శ్రీనివాసులు, తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, ఎంఇఒలు బి.రవినాయక్, జి.మనోహర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మంజునాథ్, సిడిపిఒ ఢిల్లేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున ఎంపిపి విశాలాక్షి

In the court of the VI th Addl. District Judge, Gooty
(In Tha Matter of Appointment of Gourdian to The Person and Property of Sankarasetty Thanoj Kumar aged 12 Years)
G.W.O.P. No:79/2023
Between:
Sankarasetty Varalakshmi W/o Sankarasetty Eswaraiah R/of D.No:6-10A, Girigetla Village, Tuggali Mandal, Kurnool Dist. ...petitioner
And
Nil
...Respondant
ప్రకటన
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడము ఏమనగా పై కేసులో మైనరు అయిన శంకరశెట్టి తనోజ్ కుమార్‌కు సంబంధించిన ఆస్తిని అమ్ముటకు మరియు మైనరుకు గార్డియన్‌గా వుండుటకు పై కోర్టులో అర్జీదారురాలు అర్జీ దాఖలు చేసి యున్నారు. సదరి కేసు 09/02/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆరోజు ఎవరికైన ఎటువంటి ఆక్షేపణలున్నచో స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు అర్జీదారురాలు పరంగా తీర్మానింతురని తెల్పడమైనది.
SCHEDULE
Property Situated within R.D.of Ananthapuramu and SRD of Tadipatri, within Yellanuru Mandal, Chinthakayamanda Panchayati, Board, Chinthakayamanda Village, Polam Limits with the following description
Govt.Dry, Sy.No:349-1, Extent A.C:180.55 Sq. Feets Bounded by : East:Rasta, West:Rasta, North:Kummetha Nageswara Reddy House, South:Nagendra House
(By ordre of The Court)
M.PARAMESWARA REDDY,
ADVOCATE, GOOTY, CELL:9849950065

In the court of the III rd Addl. Junior Civil Judge, (Excise Court) Ananthapuramu
I.A. No: 445/2023 in O.S. No:1226/2023
Between:
Kummetha Peddanna and others ...Petitioners/Plaintiffs
And
Bulle Kondamma and others ...Respondants/ Defendants
Notice To Respondant No:7
R7: Bulle Naramma D/o Satyanarayana, R/of Upparapalli Village, Ananthapuramu Rural Mandal.
పై నెంబరు కేసులో 7వ రెస్పాండెంటు అయిన మీ హాజరు నిమిత్తము 05/02/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
S.K.NARENDRA REDDY,
ADVOCATE, ANANTHAPURAMU.
CELL:9059502469

In the court of the Addl. Senior Civil Judge, Ananthapuramu
O.S. No:135/2022
Between:
Vutti Sarojamma (Died by her L.Rs)
Vutti Babu Yerri Swamy and others ...Plaintiffs
And
R.B.Saroja and another ...Defendants
Notice To DEfendant No:1 & 2
D1: R.B.Saroja W/o Late R.Narasimhulu
D2:Prasad Bandari M/o R.B.Saroja
Both are R/at 12/963, Sai Nagar, Ananthapuramu.
పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము 09/02/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
ALURU RAGHAVENDRA,
ADVOCATE, ANANTHAPURAMU.
CELL:9440181500

ఉద్యమాల 'పెద్దన్న'

తుదిశ్వాస వరకు ప్రజాపోరాటం
పెత్తందారీ, భూర్జువా పోకడలపై నిరసనగళం
పేదల కోసం పరితపించిన నాయకుడు
నేడు అనంతలో కామ్రేడ్ పెద్దన్న సంస్మరణ సభ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కామ్రేడ్ పెద్దన్న.. అనంతపురం కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే ఉద్యమ నేత. పేదల కోసం తుదిశ్వాస వరకు పరితపించి ప్రజాఉద్యమాలను నిర్వహించిన పోరాటయోధుడు. సిపిఐ(ఎంఎల్) నాయకునిగా ఐదు దశాబ్దాల పాటు అనంతపురం జిల్లా కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో తనకంటూ ఒక చరిత్రను సృష్టించుకున్నారు. "ఉద్యమాల పెద్దన్న"గా ఆయన్ను అందరూ పిలుస్తారంటే ఆయన ప్రజాపోరాటాలు ఎలా చేశారో అర్థం చేసుకోవచ్చు. 1974లో పేదలకు ఇళ్ల స్థలాల కోసం అనంతపురం నగర శివారులోని ప్రభుత్వ భూమిలో యువజన కాలనీని ఏర్పాటు చేయడం మొదలు 2005లో కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న ఎంఎస్.నగర్ ఏర్పాటు వరకు దాదాపు 8 కాలనీల్లో వేల కుటుంబాలకు ఆశ్రయం కల్పించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వచ్చిన రజక కుటుంబాలకు "రజక్‌నగర్" ఏర్పాటు చేసి వారికి ఆశ్రయం కల్పించారు. ఇలా ఆయన సాగించిన పోరాటాలు అనేకం. వయస్సు మళ్లినా, శారీరక, ఆరోగ్య సమస్యలు వేధిస్తున్నా అదే ధైర్యం, ఆదే పట్టుదలతో తదిశ్వాస వరకు ప్రజా పోరాటాన్ని కొనసాగించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పరితపించిన ఆయన వయోభారం, అనారోగ్య సమస్యలతో ఈ నెల 14వ తేదీన తుదిశ్వాస విడిచారు. ఆదివారం నాడు ఆయన సంస్మరణ సభను అనంతపురం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. ఈసందర్భంగా కామ్రేడ్ పెద్దన్నపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

కుటుంబ నేపథ్యం

1948 జనవరి 8వ తేదీన నాగమ్మ, ఫక్కీరప్ప దంపతులకు పెద్దన్న జన్మించారు. కుటుంబ సభ్యులతో అనంతపురం రెండవరోడ్డు గొంగడి రామప్ప ఆయిల్ మిల్ దగ్గర నివాసం ఉండేవారు. 7వ తరగతి వరకు చదువుకున్న పెద్దన్నకు ప్రభుత్వ వ్యవసాయ శాఖలో టైపిస్టుగా ఉద్యోగం వచ్చింది. ఆ తరువాత రాత్రి కళాశాలల్లో చేరి డిగ్రీ పూర్తి చేశారు. తన మేనకోడలిని వివాహం చేసుకున్నాడు. కులాన్ని చులకనగా చూసేవారి పట్ల పెద్దన్న కఠినంగా వ్యవహరించడం అలవాటు చేసుకున్నారు. తన కులం గురించి గర్వంగా చెప్పుకోవడం ప్రారంభించారు. స్వతంత్రంగా రజక సంఘాన్ని ఏర్పాటుచేసి సమస్యలపై పోరాటం చేస్తూనే ఇతరులకూ నేర్పించారు. అనంతపురం జిల్లాలో రజకులను ఆత్మగౌరవ పంథాలో నడిపించడంలో పెద్దన్న ప్రముఖపాత్ర పోషించారు.

నటుడు.. మంచి వక్త..

పెద్దన్న మంచి నటుడు. విద్యార్థి దశలోనే అనంతపురం లలితకళా పరిషత్ నాటక విద్యాలయంలో ప్రముఖ రంగస్థల నటుడు రొద్దం హనుమంతరావు వద్ద నటనలో మెళకువలు నేర్చుకున్నారు. డైలాగులను నాటకీయంగా ఎలా చెప్పాలో నేర్చుకున్నారు. ఆయన నాటకం వేస్తే శ్రోతలను ఎంతగానో ఆకట్టుకునేది. అలా మంచి ఉపన్యాసకుడూ అయ్యారు. సభల్లో ఆయన చేసే ఉపన్యాసాలు ఎంతో ఉత్తేజంగానూ.. చైతన్య పూరితంగానూ ఉండేవి.

పెద్దన్నపై తరిమెల నాగిరెడ్డి ప్రభావం

పెద్దన్నకు మామ వరుస అయిన నారాయణ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీకాలం నుంచీ తరిమెల నాగిరెడ్డి రాజకీయాలను అనుసరిస్తూ నిబద్ధతగల కార్యకర్తగా ఉండేవారు. నారాయణ పెద్దన్నకు వామపక్ష రాజకీయాలను పరిచయం చేస్తూ వచ్చారు. కామ్రేడ్ నాగిరెడ్డిని నారాయణ పరిచయం చేయడంతో పెద్దన్న నాగిరెడ్డికి వీరాభిమానిగా మారిపోయారు. కామ్రేడ్ నాగిరెడ్డి గార్లదిన్నె ప్రాంతంలో బంజరు భూముల స్వాధీన ఉద్యమాన్ని నడపడం కళ్లారా చూసిన తర్వాత పెద్దన్న మరింతగా ప్రభావితుడు అయ్యి క్రియాశీలక కమ్యూనిస్టు ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1972 తర్వాత కామ్రేడ్ నాగిరెడ్డి అనంతపురం నుంచి జనశక్తి పత్రికను రంగనాయకులు శారదాప్రెస్‌లో ముద్రించడం ప్రారంభించారు. పేపర్ ప్రింట్ అయిన వెంటనే పెద్దన్న బందం మడతపెట్టి పోస్ట్ చేయడానికి వీలుగా రాత్రిళ్ళు వచ్చి పని చేసేవారు. ఈ కాలంలోనే పార్టీ యూనిట్ ఏర్పడింది. ఇక అక్కడనుంచి పార్టీ కార్యక్రమాలు, రజక సంఘం కార్యక్రమాలు, టైపిస్ట్ సంఘం అధ్యక్షుడిగా, ఎన్జీవో పట్టణ శాఖ అధ్యక్షుడిగా పెద్దన్న అన్ని కార్యక్రమాలనూ సమన్వయం చేసుకుంటూ ముందుకు నడిచాడు. 1971-72 ప్రాంతంలో అనంతపురం రెండవ రోడ్డులో స్థానిక యువ మిత్రులతో కలిసి యువజన సంఘం స్థాపించారు. సాంఘిక సేవా కార్యక్రమాలను కొనసాగించారు. రాత్రిళ్ల వయోజన పాఠశాలను నడిపించారు. అనంతపురం ఐదవ రోడ్డులో దాదాపు వెయ్యి కుటుంబాల వరకూ నివాసం ఉండేవారు. వీరికి పట్టాలు లేవు. వీరిలో అత్యధిక భాగం షికారి తెగ, రాతివడ్డే కులానికి చెందిన వారు ఉండేవారు. అంతర్గత రోడ్లకు అవకాశం లేకుండా ఎటుబడితే అటు ఉన్న ఇళ్ళతోపాటు మధ్యమధ్యలో మురుగునీటి మడుగులు ఉండేవి. గతంలో ప్రభుత్వం వీరికి పట్టాలు ఇవ్వాలని ప్రయత్నించినా, వీరిని సముదాయించలేక విఫలమయ్యారు. పెద్దన్న ఆధ్వర్యంలో యువజన సంఘం కార్యకర్తలు గుంతలుపూడ్చి, రోడ్లకు అడ్డంగా ఉన్న వారిని సముదాయించి ఒక పద్ధతి ప్రకారం వాటినిమార్చి పట్టాల మంజూరుకు అవకాశం ఉండేవిధంగా కృషి చేసారు.

> **నేడు పెద్దన్న సంస్మరణ సభ**
>
> సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు పెద్దన్న సంస్మరణ సభ ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. రజకనగర్‌లోని కమ్యూనిటీ హాలులో ఉదయం 11 గంటలకు సంస్మరణ సభ జరుగనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, వామపక్ష శ్రేయోభిలాషులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తుదిశ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన పెద్దన్న వామపక్షాల ఐక్యతకు పనిచేసారని తెలిపారు.

సాగు రైతులకు పట్టాలు

1994 ప్రాంతంలో బొమ్మనహాల్ మండలంలో గోవిందవాడ అనే మారుమూల గ్రామానికి చెందిన భూసమస్య ఉండేది. ఆ గ్రామానికి చెందిన ఒక పెత్తందారు ఆధీనంలో వంద ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఉండేది. ఆ భూమిని దాదాపు 30-40 మంది రైతులు కౌలుకు చేసుకునేవారు. ఆ కౌలు రైతులు తమకే సాగుపట్టాలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు ఇచ్చుకుంటూ వచ్చారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో పెద్దన్న సాగురైతుల తరపున ధైర్యంగా నిలబడి వారి సాగు పట్టాలు వచ్చేలా విజయవంతమైన పోరాటం సాగించారు. ఇదే రకంగా కణేకల్లు, బొమ్మనహాల్ ప్రాంతాల్లోనూ చాలా మంది పేద రైతులకు సాగు పట్టాలను ఇప్పించారు.

వయోభారం.. అనారోగ్య సమస్యలు..!

పోరాటాలు కొనసాగిస్తుండగానే పెద్దన్నను ఆరోగ్య సమస్యలు వెంటాడడం ప్రారంభించాయి. షుగరు, బిపిల అదుపుకోసం నిత్యం మందులు వాడాల్సి వచ్చేది. ప్రజా పోరాట కార్యక్రమాల్లో ఉంటూ ఒక్కోసారి మందులు వాడటం మర్చిపోయేవారు. కోవిడ్ సమయంలో మూడుసార్లు ఆసుపత్రిలో చేరారు. ఇలా వయోభారం, ఆరోగ్య సమస్యలు ఆయన్ను ఇబ్బంది పెట్టడం మొదలు పెట్టాయి. ఈ నేపథ్యంలోనే ఈ నెల 14వ తేదీ తెల్లవారు జామున ఆయన తుదిశ్వాస విడిచారు. పెద్దన్న భౌతికంగా లేకపోయినా ఆయన నిర్మించిన అనేక కాలనీలు, భవనాలు, ప్రజాపోరాటాలు చరిత్రలో ఎప్పటికీ కన్పిస్తూనే ఉంటాయని కమ్యూనిస్టు నేతలు చెబుతున్నారు.

ఉత్తమ పురస్కార గ్రహీతలకు అభినందనలు

ఎంపిడిఒను సన్మానిస్తున్న నాయకులు

నార్పల : జిల్లాకేంద్రంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ పురస్కారాలు అందుకున్న ఎంపిడిఒ దివాకర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, సిద్ధరాచెర్ల విఆర్ఒ మౌనిక లక్ష్మి, విద్యాధికారి కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ విష్ణువర్ధన్ రాజారెడ్డికి పలువురు శుక్రవారం అభినందనలు తెలిపారు. ఇందులో భాగంగా ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి నాగేశ్వరరావు, ఎంపిటిసిలు గొల్లపల్లి శంకర్‌యాదవ్, పద్మాకర్‌రెడ్డి, కొప్పూరు హెల్త్ సూపర్‌వైజర్‌తోపాటు పలువురు ఎంపిడిఒను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. అలాగే విఆర్ఒ మౌనిక లక్ష్మిని తహశీల్దార్ హరికుమార్, సిబ్బంది, ఎంఇఒ కార్యాలయ ఆపరేటర్ విష్ణువర్ధన్ రాజారెడ్డిని విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి కార్యాలయ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

700 మంది విద్యార్థుల రిజిస్ట్రేషన్

కుందుర్పి : భారత గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జ్ఞాపకార్థం ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎస్‌కె.ఛారిటబుల్ ట్రస్టు, వదాన్య జన సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే టాలెంట్ టెస్టులో పాల్గొనేందుకు దాదాపు 700 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్టు వ్యవస్థాపకులు ఎస్‌కె.లెనిన్‌బాబు మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్ రాయడానికి రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులందరూ తమ హాల్ టిక్కెట్లు తీసుకుని రేపు ఉదయం 9:30కు కుందుర్పిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

'రా కదలి రా'కు తరలిన తెలుగు తమ్ముళ్లు

పామిడి : ఉరవకొండలో టిడిపి అధినేత చంద్రబాబు నిర్వహించిన రా కదలిరా కార్యక్రమానికి మండలం నుంచి తెలుగు తమ్ముళ్లు భారీగా తరలివెళ్లారు. ఇందులో భాగంగా మండలంలోని 19 పంచాయతీల్లోని టిడిపి కార్యకర్తలు, అభిమానులు వాహనాల్లో తరిలారు. వెళ్లిన వారిలో టిడిపి నాయకులు బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌చౌదరి, లక్ష్మీనారాయణరెడ్డి, గౌస్, ఉప్పర రామాంజనేయులు, రామకృష్ణ, వడ్డే శివ, నల్లబోతుల శీన, సుంకప్ప, బొమ్మా మోహన్, కరూరు శివశంకర్, సెల్ పాయింట్ సూరి, గాది లింగప్పగౌడ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి పివికెకెలో 'స్వాధ్యాయ-2024'

అనంతపురం : నగరంలోని రుద్రంపేట వద్ద ఉన్న పివికెకె ఐటి డిప్లొమా కళాశాలలో ఈనెల 29వ తేదీ నుంచి మూడు రోజులపాటు 'స్వాధ్యాయ - 2024' పేర జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జిఎన్ఎస్.వైభవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య ప్రారంభించన్నుట్లు తెలిపారు.

దుస్తులు పంపిణీ

దుస్తులు పంపిణీ చేస్తున్న అతిథులు

బుక్కరాయసముద్రం : పరమపిద శ్రీవెంకటరమణాచార్య గురువు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని సంజీపురం గ్రామంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సునీత, ట్రస్టు అధ్యక్షురాలు యోగి ముక్తేశ్వరి మాత, వైస్ ఛైర్మన్ అశోక్ కుమార్, కోశాధికారి రామాంజనేయులు, మల్లికార్జున ట్రెజరీ నాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మాదిగల సమ్మేళనం

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

శింగనమల : ఈనెల 28న మండల కేంద్రంలో నిర్వహించనున్న మాదిగల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిన్న జలాలపురం ఓబులేసు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపుగా 80 వేల మంది మాదిగలు కలిగిన నియోజకవర్గంలో మాదిగల సమ్మేళనం నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. కావున మాదిగలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాచేపల్లి నాగభూషణం, రాచేపల్లి పాండురంగయ్య, భానుప్రకాష్, ఇరువెందుల లక్ష్మన్న, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

29లోపు ఇంటర్ తత్కాల్ ఫీజు చెల్లించాలి

ఉరవకొండ : ఈనెల 29వతేదీలోపు మార్చి-2024 జరగబోయే ఇంటర్ పబ్లిక్ పరీక్షల తత్కాల్ ఫీజును చెల్లించాలని ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మమత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులందరూ పరీక్ష ఫీజుతోపాటు అదనంగా రూ.3వేల అపరాధ రుసుంతో కళాశాల కార్యాలయంలో చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రికెట్ పోటీలో గార్లదిన్నె జట్టు విజయం

విజేత జట్టుతో గార్లదిన్నె జట్టు

శింగనమల : 'ఆడుదాం ఆంధ్ర' క్రీడాపోటీల్లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన క్రికెట్ పోటీలో గార్లదిన్నె జట్టు విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన గార్లదిన్నె జట్టు 10 ఓవర్లలో 88 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగుకు దిగిన బుక్కరాయసముద్రం 10 ఓవర్లలో 63 పరుగులు మాత్రమే చేసింది. 25 పరుగుల తేడాతో గార్లదిన్నె జట్టు నియోజకవర్గ విజేతగా నిలిచింది. విన్నర్ జట్టుకు రూ.35 వేలు, రన్నర్స్‌కు రూ.25 వేలు, మూడో స్థానంలో నిలిచిన యల్లనూరు జట్టుకు రూ.10వేలు అందజేసినట్లు ఎంపిడిఒ నిర్మలాకుమారి తెలిపారు.

కందివామి దగ్ధం

పెద్దపప్పూరు : మండలంలోని చీమలవాగుపల్లికు చెందిన ఉండుచిగుర్ల రంగయ్యకు చెందిన కంది పంట వామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. రంగయ్యకు పసులూరు గ్రామ రెవెన్యూ పొలంలో తనకున్న 4.30 ఎకరాల పొలంలో కంది పంటను సాగు చేసి ఈనెల 23న కోసి వామిగా ఏర్పాటు చేసుకున్నాడు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం వామి వద్దకు వెళ్లి చూడగా వామి పూర్తిగా అగ్నికి ఆహుతైనట్లు గమణించానన్నారు. వెంటనే గమణించి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఫిర్యాదు అందుకున్న ఎస్ఐ శరత్‌చంద్ర ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పూర్తిగా దగ్ధమైన కంది వామి

కంది కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-ఉరవకొండ

కందులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంది కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిలా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. శనివారం మండల పరిధిలోని రాకెట్ల, కౌకుంట్ల గ్రామాల్లో పంట నమోదు చేసుకున్న పొలాల్లో కంది పంటను పరిశీలించారు. ఇందులో భాగంగా అనంతరం రాకెట్ల పరిధిలోని ముత్తులూరు అశోక్‌కుమార్, దయ్యాల నాగరాజు, కౌకుంట్లలోని ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పొలాలను సందర్శించారు. రికార్డుల్లో ఉన్న పంట నమోదు వివరాలు, పొలంలో ఉన్న పంటలను సరిచూశారు. అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ మార్కెట్ ధరకే ప్రభుత్వం కంది పంటను కొనుగోలు చేస్తోందన్నారు. కందులు పండించిన ప్రతి రైతూ ప్రభుత్వానికి అమ్మితే సకాలంలో సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఇదే పంటను శుద్ధి చేసి తిరిగి రేషన్ షాపుల ద్వారా ప్రజలకు అందిస్తారన్నారు. కావున ప్రతి రైతూ ప్రభుత్వానికి అమ్మాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శుభకర్, రాకెట్ల, కౌకుంట్ల రైతు భరోసా సిబ్బంది రామ్మూర్తి, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యసేవలు

ప్రజాశక్తి-ఉరవకొండ

వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నామని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని గడేకల్ సచివాలయం-2లో సర్పంచి సుశీలా ఉమాశంకర్ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ప్రజల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. అదే సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక పేదల వద్దకే కార్పొరేట్ వైద్యాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో విడపనకల్లు వైసిపి సీనియర్ నాయకుడు కరణం భీమిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సోమయ్య, శిల్ప, డాక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, రాజు, అబ్దుల్, కంటి వెద్య సహాయకుడు ఇజాజ్‌హుస్సేన్, వైద్య బృందం తిరుపాల్‌నాయక్, రామకృష్ణ, ఫర్జాహన్, సుగుణ, వైసిపి నాయకులు హంపయ్య, ఉమాశంకర్, అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిని నిర్మూలించాలి

కుష్టు వ్యాధి విభాగం జిల్లా అధికారి అనుపమ జేమ్స్

ప్రజాశక్తి-అనంతపురం

మాట్లాడుతున్న అధికారులు

కుష్టువ్యాధిని నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కుష్టు వ్యాధి విభాగం జిల్లా అధికారి అనుపమ జేమ్స్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో నెలవారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష-2'లో భాగంగా చేపట్టిన వైద్య శిబిరాల్లో సంబంధిత డిప్యూటీ పారామెడికల్ అధికారులు పాల్గొని కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో వైద్యులు గంగాధర్‌రెడ్డి, శివారెడ్డి, పారామెడికల్ అధికారి నాగన్న, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సత్యనారాయణ, డిప్యూటీ పారామెడికల్ అధికారి సూర్యప్రకాష్‌రెడ్డి, రాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో అవగాహన సదస్సు

అనంతపురం : నగరంలోని ఆదిమూర్తి నగర్‌లో ఉన్న బిసి, ఎస్సీ, సాంఘిక సంక్షేమ కళాశాల వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్లుకు కెరీర్ గైడెన్స్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ఏఏ కోర్సు చదివితే భవిష్యత్తులో ఏస్థాయిలో స్థిరపడుతారో వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి ఎ.కళ్యాణి జిల్లా వెనుక బడిన తరగతులు సంక్షేమ అధికారిణి ఖుష్బూకొఠారి, సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సుభాషిణి, వసతిగృహ సంక్షేమధికారులు మాధవి, వసంతకుమారి, అనిత, జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

'ఇంటింటికీ వైసిపి' ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని భవానీనగర్‌లో చేపట్టిన ఇంటింటికీ వైసీపీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శనివారం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లగా నియోజకవర్గంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో రూ.2304 కోట్లతో సంక్షేమ పథకాలు, రూ.1045 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఆయా పథకాలను వివరించేందుకే 'ఇంటింటికీ వైసీపీ' చేపట్టామన్నారు. జగన్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఆయా అభివృద్ధి పనులను చూసి మరోసారి వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలో రూ.40 లక్షలతో చేపట్టిన రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచి లలిత, ఎంపిపి నరసింహులు, నాయకులు బసవరాజు, ఓబన్న, కొడికి గోవిందు తదితరులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఉరవకొండ పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రభుత్వ, ఉపాధి, పంచాయతీ నిధులు రూ.10 కోట్లతో అనేక కాలనీల్లో రోడ్లు, కల్వర్టులు, డ్రెయినేజీలు నిర్మించామని వివరించారు. పట్టణాన్ని మరింత అభివద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ ఆసీఫ్, కో ఆప్షన్ సభ్యుడు పామిడి సలీమ్, నాయకులు నిమ్మల వెంకటరమణ, పచ్చి రవి, వేమన్న, రఫిక్, ఆటో సీనా, తాజుద్దీన్, అమర్నాథ్, జోగి భీమన్న, హనుమంతు, యూసుఫ్, అంజి, విశ్వనాథ్, ఉలిగప్ప, ఓబులేసు, శర్మస్, మహనంద తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

ఆటో డ్రైవర్లకు యూనిఫాం అందజేత

గుత్తి : గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు విక.సుధీర్‌రెడ్డి జయంతి పురస్కరించుకుని స్థానిక కళాశాలలో 200 మంది డ్రైవర్లకు ఉచితంగా యూనిఫాం పంపిణీ చేశారు. ముందుగా కళాశాలలో విక. సుధీర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని బస్టాండ్‌లో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ విక.పద్మావతమ్మ, డైరెక్టర్ విక. శ్రీవాణి, ఎండి గజ్జల రఘునాథరెడ్డి మాట్లాడుతూ విక.సుధీర్‌రెడ్డి సేవలు మరువలేవన్నారు. విక.సుధీర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లకు యూనిఫాం అందజేస్తున్న గేట్స్ కళాశాల కరస్పాండెంట్ విక.పద్మావతమ్మ